# పెన్ పవర్

PEN POWER 12 YEARS JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 313 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 17 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 313 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 17 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

## ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

- తిరుమలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- రూ.104 కోట్లతో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి
- తిరుమల వచ్చే ప్రతి భక్తుడికి రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

2లో



# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్

- మిగతా 2లో





## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చంద్రబాబు సంక్షేమ డ్రామా ఆడుతున్నారని వైసీపీ విమర్శ
- కొత్త ప్రభుత్వం వచ్చాక అర్హులకు పెన్షన్లు ఇవ్వడం లేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపణ
- దాదాపు 6 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను తొలగించారని విమర్శ
- జగన్ తెచ్చిన జీవోతోనే అసైన్డ్ భూములకు హక్కులు దక్కుతున్నాయని వెల్లడి
- కేంద్రం కేటాయించిన ఇళ్లు నామమాత్రమేనని వ్యాఖ్య

- మిగతా 2లో

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- డిశ్చార్జ్ పిటిషన్లు వేసిన గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి
- పిటిషన్లకు విచారణార్హత లేదన్న కోర్టు
- నిందితులపై అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా

- మిగతా 2లో



## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు..
# 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- 2013లో కాంగ్రెస్ పార్టీ పరివర్తన్ యాత్రపై దాడి
- మావోల దాడిలో 29 మంది దుర్మరణం
- 10 మంది మావోలకు ఉరిశిక్ష విధించిన ఎన్ఐఏ న్యాయస్థానం

**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు

- మిగతా 2లో

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం
- ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

- మిగతా 2లో







## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

- భార్య ముక్కు కొరికేసిన భర్త
- మంచిర్యాల జిల్లాలో జరిగిన దారుణ ఘటన
- కాపురానికి రావడం లేదన్న కోపంతో భర్త దాడి
- అడ్డువచ్చిన మామపై కూడా కర్రతో దాడి
- వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి బాధితురాలు తరలింపు

- మిగతా 2లో



## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

### నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో

- మిగతా 2లో

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు



- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

- మిగతా 2లో

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

**పెన్ పవర్ డెస్క్:** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు

- మిగతా 2లో



# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు..
# ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- మొదటి పేజి తరువాయి

పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

"చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## ఎడిటర్ వ్యూ

## రావాలి అవంతి అంటున్న వైసీపీ !

నాకొద్దీ పార్టీ అని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇప్పటికి రెండేళ్ళ క్రితం వైసీపీని వీడిపోయారు. చిత్రంగా ఇపుడు వైసీపీకి ఆయనే అవసరం అవుతున్నారు అని అంటున్నారు. భీమునిపట్నం వైసీపీ ఇంచార్జిగా ఉన్న చిన్న శ్రీను టీడీపీలో చేరిపోయారు. ఆయన పార్టీని వీడి పది రోజులకు దగ్గర పడుతున్నా భీమిలీ వైసీపీ ఇంచార్జిగా ఎవరిని ఎంపిక చేయాలో తెలియక ఆ పార్టీ సతమతం అవుతోంది. వైసీపీకి భీమిలీ ఇపుడు అతి పెద్ద పరీక్ష పెడుతోంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిని, అలాగే నెల్లిమర్ల వైసీపీ ఇంచార్జిని వెంటనే నియమించిన వైసీపీ అధినాయకత్వం భీమిలీ విషయంలో మాత్రం ఏమీ పాలుపోక ఆగిపోయిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే భీమిలీ టీడీపీకి కంచుకోట. అక్కడ వైసీపీని నడపడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అర్ధబలం అంగబలం ఉన్న నేతల కోసం పార్టీ చూస్తోంది.

**వైసీపీ సర్వేలో ఆయనే :**

ఇదిలా ఉంటే భీమిలీ నియోజకవర్గానికి కొత్త వైసీపీ ఇంచార్జిగా ఎవరిని నియమించాలి అన్న దాని మీద పార్టీ అంతర్గత సర్వే నిర్వహిస్తే మెజారిటీ క్యాడర్ తో పాటు నాయకులు అంతా అవంతికి జై కొట్టారని తెలుస్తోంది. అవంతి 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేశారు. విశాఖ వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఆయన ఉన్నారు. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు అంగబలం అర్ధ బలానికి లోటు లేదు. ఇక 2009లో ప్రజా రాజ్యం నుంచి ఒకసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలా ఆయనకంటూ సొంత బలం అనుచర గణం ఉంది. అందువల్ల ఆయనకే పార్టీ బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో కూటమిని ధీటుగా ఎదుర్కొంటారు అని అంటున్నారు. ఇది భీమిలీ మెజారిటీ వైసీపీ నేతల మాటగా ఉంది.

**ఇంతకీ ఆయన వస్తారా :**

అయితే ఇదంతా ఒంటి చేతి చప్పుడు మాదిరిగానే ఉంది అంటున్నారు. వైసీపీ తన సర్వేలు తాను చేస్తోంది. అందులో అవంతి పేరు కూడా జోడించింది. అందరూ అవంతి కావాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ ఇంతకీ అవంతి శ్రీనివాసరావు వైసీపీలోకి తిరిగి చేరుతారా అన్నదే పెద్ద చర్చగా ఉంది. ఆయన 2024 డిసెంబర్ లో వైసీపీకి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన ఆలోచనలు కూటమిలో చేరాలని. అందుకే వైసీపీ మేయర్ ని దించడానికి కార్పోరేటర్ గా ఉన్న తన కుమార్తె చేత కూడా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించి టీడీపీ కూటమికి జీవీఎంసీ దక్కేలా చేశారు. అయితే టీడీపీలో ఆయన రాకను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకించడంతో ఆగింది అని అంటున్నారు.

**తగిన మూల్యం చెల్లిస్తోంది :**

జనసేనలో ఆయనను చేర్చుకోవడానికి కూడా స్థానికంగా అంగీకారం లేదని చెబుతున్నారు. ఈ కారణాల వల్లనే ఆయన ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు అని అంటున్నారు. డీలిమిటేషన్ మీద అవంతి ఆశలు పెట్టుకున్నారు. సీట్లు పెరిగితే కనుక కూటమి పార్టీలలో చేరి మళ్ళీ పోటీ చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అవంతి వైసీపీలో చేరుతారు అన్నది ఎంతవరకూ జరుగుతుంది అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఒకవేళ మనసు మార్చుకుని అవంతి వైసీపీలో చేరితే మాత్రం వైసీపీకి గండం గట్టెక్కినట్లే అంటున్నారు. మొత్తానికి చూస్తే గతంలో వైసీపీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. కానీ ఎన్నికల వేళ వారిని అందరినీ దూరం చేసుకున్న పాపానికి ఇపుడు వైసీపీ తగిన మూల్యం చెల్లిస్తోంది అని అంటున్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

- మొదటి పేజి తరువాయి

అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్‌ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

తిరుమలను ప్రపంచస్థాయి పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ఓ గొప్ప నమూనాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను ఆధ్యాత్మికతతో సమన్వయం చేస్తూ భక్తులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, బుధవారం తిరుమలలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.104 కోట్ల భారీ వ్యయంతో టీసీఎస్ ట్రస్ట్ ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంతో పాటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన 'పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ఆయన భక్తులకు అంకితం చేశారు. భక్తులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. ఇందులో శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలతో పాటు తిరుమల క్షేత్రంలోని వివిధ ప్రాంతాలను 3డీ సాంకేతికత ద్వారా కళ్లారా వీక్షించే అవకాశం కల్పించారు. 6డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీనివాసుని కల్యాణ ఘట్టం వంటి విశేషాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ఇందులో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు స్వామివారికి సమర్పించిన ఆభరణాల 3డీ నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారి కిరీటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పానోరమిక్ స్క్రీన్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన శ్రీవారి పరిణయ వీడియోను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. ఆనాటి సంగీత విద్వాంసులు వాడిన వాయిద్య పరికరాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరికొన్ని కీలక ప్రకటనలు చేశారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎల్ఐసీ భాగస్వామ్యంతో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీని ద్వారా తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం, తిరుమలలో భక్తుల సౌకర్యార్థం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాతల ప్రతినిధులు సుచిత్రా ఎల్లా, నితిన్ సేత్‌లతో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కొండపై 89.5 శాతం పచ్చదనం ఉందని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సేవ, ఆధునిక సాంకేతికత వంటి ఆరు కీలక అంశాల ప్రాతిపదికన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు

ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

- మొదటి పేజి తరువాయి

అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు. అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. పదేళ్లుగా వివాదాస్పద అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టా హక్కులు కల్పించే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూములను ఫ్రీహోల్డ్ ఆస్తులుగా మార్చడం ఆ జీవో ఫలితమేనని, కానీ దీనిని తమ ఘనతగా చెప్పుకుంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ంరాష్ట్రానికి 5 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడంపై స్పందిస్తూ.. జగన్ ప్రభుత్వం మహిళల పేరు మీద పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలతో పోలిస్తే ఇది చాలా తక్కువని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు.. 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- మొదటి పేజి తరువాయి

మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గ్రామాల విలీన వ్యతిరేక కేసులు ఉపసంహరించు కోవాలి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**రాజమహేంద్రవరం నగర సమీప గ్రామాల విలీనం వ్యతిరేకిస్తూ కోర్టులో కేసులు వేసిన రాజకీయ నాయకులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కేసులు ఉపసరించు కోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్ర వేణుగోపాల రాయుడు విజ్ఞప్తి చేశారు. విలీనం జరిగితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, వ్యతిరేకించినట్లైనా గ్రామాలకు, నగరానికి ఎన్నికలు జరుగుతాయని ఆయన అన్నారు. ప్రజా ప్రయోజనాలు, నగర అభివృద్ధి, కేంద్ర నిధుల లభ్యత కోసం కోర్టు కేసులను ఉపరించు కోవాలని కోరారు. లేదంటే కోర్టులో సమర్థ వాదనలు వినిపించాలన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ పదవిని కూటమి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే తాను మేయర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని యర్ర వేణుగోపాల రాయుడు తెలిపారు. మేయర్ పదవిని కూటమిలోని జనసేన లేదా బీజేపీకి కేటాయిస్తే, కూటమి నిర్ణయాన్ని గౌరవిస్తూ ఎంపిక చేసిన అభ్యర్థి కి తన సంపూర్ణ మద్దతు అందిస్తానన్నారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వయం ముఖ్య మన్నారు. పదవులలో వ్యక్తిగత ఆశయాల కంటే కూటమి ప్రయోజనాలు, పార్టీ నిర్ణయాలకే తాను ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. నగరానికి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తింపు ఉందని వేణుగోపాల రాయుడు అన్నారు. నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, వీధి దీపాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటు లో ఉండే పాలన అవసరం ఉందన్నారు. మేయర్ పదవి ఎవరికి దక్కినా కూటమి ప్రభుత్వం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాభివృద్ధి జరగడమే ప్రధాన లక్ష్యమన్నారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని యర్ర వేణుగోపాల రాయుడు తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు యు.జానకి రామయ్య, ఎం.రవి యాదవ్, నల్లం శ్రీనివాస్, రోబ్బి శేఖర్ , పి రవి, కె.విజయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల వారీగా శానిటేషన్ సౌకర్యాలు, మానవ వనరుల వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలి





**– కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 16:**2027 గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన శానిటేషన్ మౌలిక వసతులు ప్రణాళికలపై సమగ్రంగా చర్చించి, పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంసీ, పంచాయతీరాజ్, కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గత పుష్కరాల సందర్భంగా చేపట్టిన శానిటేషన్, మౌలిక వసతులు, యాత్రికులకు కల్పించిన సౌకర్యాలు, మానవ వనరుల వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. గత అనుభవాల ఆధారంగా 2027 పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, ప్రస్తుతం ఉన్న వసతులు, అదనంగా కల్పించాల్సిన సౌకర్యాలపై రూపొందించిన ప్రణాళికను సమావేశంలో సమగ్రంగా పరిశీలించారు. పుష్కర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, ఘాట్ల పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ--తరలింపు, పారిశుధ్య సిబ్బంది, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు వసతులు, తాగునీరు, ఇతర అవసరమైన యాత్రికుల సౌకర్యాలు వంటి అంశాలను ముందుగానే గుర్తించి, వాటికి అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు, మానవ వనరులను అంచనా వేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో గ్రామాల వారీగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, అవసరమైన అదనపు సౌకర్యాలు, శానిటేషన్‌కు అవసరమైన సిబ్బంది, ఇతర మానవ వనరుల వివరాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా నివేదికలను క్రోడీకరించి, శాఖల వారీగా అవసరాలను గుర్తించి, సంబంధిత శాఖల కార్యదర్శుల ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పారిశుధ్య సౌకర్యాలు, తాగునీరు, తాత్కాలిక వసతులు, అవసరమైన మానవ వనరులపై గ్రామాల వారీగా సమగ్ర వివరాలు సేకరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి వాస్తవ అవసరాలను నివేదికల్లో పొందుపరచాలని, వాటిని క్రోడీకరించి పై అంశాల ప్రాధాన్యత పై 2027 పుష్కరాల అనుగుణంగా శాఖల వారీ ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత శాఖల కార్యదర్శుల ఆమోదానికి పంపాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో వివిధ శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు ప్రణాళిక అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అవసరాలను ముందుగానే గుర్తించి, పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను సమగ్రంగా ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు. తదుపరి సమావేశానికి గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు కూడా హాజరై, పుష్కర ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, అదనంగా చేపట్టాల్సిన పనులపై సమగ్ర వివరాలతో రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, సహాయ కలెక్టర్ కె. ఆదిత్య శర్మ, పి డి సి మహేష్, డీపీఓ వి. శాంతామణి, డివిజనల్ అభివృద్ధి అధికారులు పి. వీణాదేవి, కె. శ్రీనివాస్ రావు, కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఆర్ఎంసీ, పంచాయతీరాజ్, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చింతూరులో టీడీపీ శ్రేణుల విస్తృత సమావేశం





**97 కుటుంబాల పార్టీలో చేరిక.**

**సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**చింతూరు మండల టీడీపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశం మండల టీడీపీ అధ్యక్షుడు మొహమ్మద్ జమాల్ ఖాన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, పోలవరం జిల్లా ఎన్నికల పరిశీలకులు కె. సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, బాబు రమేష్, వంతల రాజేశ్వరి తదితరులు హాజరయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులకు నాయకులు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేయడం, ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

**టీడీపీలో 97 కుటుంబాల చేరిక**

సమావేశం సందర్భంగా టీడీపీలో భారీగా చేరికలు జరిగాయి. పేగ పంచాయతీ పరిధిలోని అహ్మదల్లిపేట, పేగ, కొల్లిగొండ గ్రామాలకు చెందిన సుమారు 60 కుటుంబాలు ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, మండల టీడీపీ అధ్యక్షుడు మొహమ్మద్ జమాల్ ఖాన్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. అదేవిధంగా కొత్తపల్లి పంచాయతీకి చెందిన 37 కుటుంబాలు కూడా టీడీపీలో చేరాయి. దీంతో మొత్తం 97 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమను ఆకట్టుకోవడంతో టీడీపీలో చేరినట్లు నూతనంగా పార్టీలో చేరిన వారు తెలిపారు.

**సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

అనంతరం చింతూరు గ్రామపంచాయతీ పరిధిలో సినిమా హాల్ సెంటర్ నుంచి వాడవజారు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. టీడీపీ సమావేశం, 97 కుటుంబాల చేరికలు, సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమాలతో చింతూరులో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఆళ్ల నాని పార్థివదేహానికి గడ్డమణుగు నివాళి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబరు 16;**మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ శాసనసభ్యులు ఆళ్ల నాని మృతి పట్ల మాజీ జెడ్పీటీసీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న స్వామివారి దేవస్థానం స్టేట్ ట్రస్టు బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బుధవారం ఏలూరులోని ఆళ్ల నాని స్వగృహానికి వెళ్లిన రవికుమార్, ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని గారితో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఆయన స్మరించుకున్నారు. 1998లో తామిద్దరం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కలిసి పనిచేశామని, అప్పటి నుంచి నానితో తనకు వ్యక్తిగతంగా ఎంతో ఆత్మీయ అనుబంధం కొనసాగిందని రవికుమార్ గుర్తుచేసుకున్నారు. ప్రజా జీవితంలో నానితో కలిసి పనిచేసిన అనుభవాలను స్మరించుకుంటూ, ఆయన మృతి తీరని లోటని అన్నారు.

ఆళ్ల నాని అకాల మరణం ఏలూరు ప్రజలకు మాత్రమే కాకుండా ఉమ్మడి జిల్లాలోని ప్రజానీకానికి, ఆయనను నమ్ముకుని పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పూడ్చలేని లోటని రవికుమార్ పేర్కొన్నారు. పిన్నవయసులోనే ప్రజలకు, అభిమానులకు దూరం కావడం అత్యంత విషాదకరమన్నారు. ప్రజా జీవితంలో ఆళ్ల నాని అందించిన సేవలను స్మరించుకున్న రవికుమార్, ఏలూరు అభివృద్ధికి ఆయన చేసిన కృషి, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.

ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు.

# ఉద్యాన పంటలపై గోప్యత ఎందుకో

**రహస్యంగా దాచి పెడుతున్న విఏఏలు!**



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ :16**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన యంత్రాంగమే వాటిని రహస్యంగా దాచిపెడుతూ గోప్యంగా ఉంచుతుంది. దీంతో పలు గ్రామాల్లో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యాన శాఖ పరిధిలోకి వచ్చేసరికి ఏ ఏ పథకాలు ఉన్నాయనిది ఇప్పటికీ అయోమయంగా మారింది. తమకు తెలిసిన వారికే ఆ పథకాలు రాయితీ అందుతుందనది బహిరంగ రహస్యం. అంతేకాకుండాముడుపులు అందిన వారికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి అనేది రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఎలినో ప్రభావంతో వరికి ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. మరోవైపు అధికార శాఖ దీనిపై పట్టించుకోవడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు అందాల్సిన పథకాలు, రాయితీలపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాల్సిన వ్యవసాయ, ఉద్యాన శాఖ అయితే కొన్ని గ్రామాల్లో పథకాల సమాచారాన్ని రైతులకు పూర్తిస్థాయిలో తెలియజేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమకు నచ్చిన రైతులకే పథకాలు, రాయితీలు అందేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాజానగరం నియోజకవర్గంలోని ప్రధానంగా సీతానగరం మండలంలో గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) తీరుపై పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు అందిన వారికే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పథకాలకు అర్హత, దరఖాస్తు విధానం, రాయితీల వివరాలను రైతులకు బహిరంగంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేసి అర్హులైన ప్రతి రైతుకు ప్రయోజనం అందేలా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు.

గ్రామస్థాయిలో జరుగుతున్న వ్యవహారాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అధికారుల నిర్లక్ష్యం ఎక్కడ? రైతులకు అందాల్సిన పథకాలు ఎవరికి చేరుతున్నాయి?

**జాడ లేని ఉద్యాన శాఖ**

సీతానగరం మండలంలో లంక ప్రాంతాల్లో ఉద్యాన పంటలను పండించాలని రైతులు ఉత్సాహం చూపుతున్నారు. దీనికి సంబంధించిన ఉద్యాన శాఖ అడుగులు సవ్వడి కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలో ఆ శాఖకు సంబంధించి ఒక కార్యాలయం గానీ అధికార ఎవరో గాని ఇప్పుడు తెలియని పరిస్థితి ఉందంటున్నారు. గతంలో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దనే ఉద్యాన శాఖ అధికారులు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి సీతానగరం మండలంలో కనిపించడం లేదంటున్నారు. వేలాది ఎకరాల్లో అరటి, బొప్పాయి, జామ, పామాయిల్, కూరపాదులు విస్తారంగా పండించే సీతానగరం మండలంలోని దారుణమైన పరిస్థితుల్లో ఆ శాఖ అధికారులు తీరుతున్న ఉందని సర్వత్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఉద్యాన శాఖ అధికారులతో రైతాంగం సమావేశం అన్ని గ్రామాల్లోని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## నీతి అయోగ్ లో అభివృద్ధి పనులు తనిఖీ చేసిన సలహాదారుడు





**వై రామవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16 :** నీతి అయోగ్ లో అభివృద్ధి లక్ష్యంగా వై.రామవరం మండలంలో నీతి అయోగ్ సలహాదారు నీలపు కార్తీక్ రెడ్డి క్షేత్రస్థాయి తనిఖీలు చేయడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. తనిఖీలలో భాగంగా చవిటి దిబ్బల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పీహెచ్సీలో మరుగుదొడ్లు, బర్త్ వెయిటింగ్ హాల్ మరమ్మతులు చేయించాలని సిబ్బంది కోరారు. యార్లగడ్డ జి టి డబ్ల్యూ ఏ జి హెచ్ పాఠశాలను సందర్శించారు. పలు స్వర్ణ గ్రామ కార్యాలయాలను సందర్శించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శిరీష్ రాజు, ఆకాంక్షాత్మక బ్లాక్ వ్యక్తి కె లవన్ రెడ్డి, వై.రామవరం ఎంపీటీసీ కే సుబ్బలక్ష్మి, వివిధ పంచాయతీల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# నల్లరాయి క్వారీల లీజులు రద్దు చేయాలి



- పీసా గ్రామసభను విస్మరించి లీజులు కట్టబెట్టారంటూ గిరిజనుల ఆగ్రహం
- పంట పొలాలు, ఇళ్లకు నష్టం.. కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు
- న్యాయం జరిగే వరకు పోరాటం
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**గంగవరం మండలంలోని దోనేలపల్లి, ఓజాబంద ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నల్లరాయి (బ్లాక్ గ్రానైట్) క్వారీల లీజులను తక్షణమే రద్దు చేయాలని బాధిత గిరిజనులు, రైతులు డిమాండ్ చేశారు. సూరంపాలెం, జగ్గంపాలెం, జీఎం పాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు దోనేలపల్లి కేంద్రంగా మాజీ సర్పంచ్ బల్లెం శివకుమార్ దొర అధ్యక్షతన సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ.. ఆదివాసుల జీవనాధారమైన పంట పొలాలు, నివాస ప్రాంతాలకు నష్టం కలిగిస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న క్వారీలను తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టం–1996 ప్రకారం గ్రామసభకు ఉన్న అధికారాలను గౌరవించాలని, గ్రామసభ అనుమతి లేకుండా మైనింగ్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అన్నారు.భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం నిబంధనలను ఉల్లంఘించే విధంగా గిరిజన ప్రాంతాల్లో భూములు, మైనింగ్ హక్కుల బదలాయింపు జరిగితే న్యాయపోరాటం చేస్తామని కుంజా శ్రీను హెచ్చరించారు. సుప్రీంకోర్టు సమతా తీర్పు స్ఫూర్తికి అనుగుణంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని సహజ వనరుల విషయంలో గిరిజనుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**బ్లాస్టింగ్స్‌తో ఇళ్లకు నష్టం**

క్వారీల్లో జరుగుతున్న భారీ బ్లాస్టింగ్స్ కారణంగా ఇళ్లు కంపిస్తున్నాయని, కొన్ని ఇళ్లకు బీటలు వారే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పేలుళ్ల సమయంలో రాళ్లు పంట పొలాల్లో పడుతున్నాయని, క్రషర్లు, భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.క్వారీ వ్యర్థాల కారణంగా సూరంపాలెం ప్రాజెక్టు నీరు, ముసిరిమిల్లి కెనాల్ కలుషితమయ్యే ప్రమాదం ఉందని, ఎర్రంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల పరిసరాల్లో కూడా భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. క్వారీల కోసం అడవులు నరికివేయడం వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ ఆరోపణ**

పీసా గ్రామసభల అధికారాలను విస్మరించి బాధితులు, రైతులపై అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సమావేశంలో నాయకులు ఆరోపించారు. క్వారీలకు సంబంధించిన అన్ని అనుమతులు, లీజులు, గ్రామసభ తీర్మానాలు, పర్యావరణ నిబంధనల అమలుపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు.జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్/ఆర్డీవోలు తక్షణమే స్పందించి నల్లరాయి క్వారీల వ్యవహారంపై విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే లీజులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేసి ఢిల్లీ స్థాయి వరకు న్యాయపోరాటం చేస్తామని కుంజా శ్రీను తెలిపారు.ఈ సమావేశంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు కంగాల అబ్బాయి దొర, కుంజం దొంగబాబు, చేడం సంకురు దొర, చేడెం మరియమ్మ, చోడి బాపనమ్మ, సారపు రాముదాసు దొర, బల్లెం ఆదిలక్ష్మి, కుంజం గోవిందరాజు, చోడి ఏడుకొండలరావు దొరతో పాటు పరిషత్ నాయకులు చోడి ప్రదీప్‌కుమార్ దొర, పీఠ ప్రసాద్, కలముల ప్రసాద్ దొర, గంగాభవాని, అరుణకుమారి, రాజన్న దొర, శివకుమార్ దొర తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల నిరసన దీక్ష



**పెన్ పవర్ ఉంగుటూరు, సెప్టెంబర్ 16:**తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) బుధవారం ఉంగుటూరు రెవెన్యూ కార్యాలయంలో రోజంతా నిరసన దీక్ష చేపట్టారు. వీఆర్ఏల వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, సీనియర్ వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని వీఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శి మట్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు మద్రపు సన్యాసిరావుకు అందజేశారు. కార్యక్రమంలో సూదివరపు అప్పారావు, టేకి శ్రీనివాసరావు, బి. అజయ్, వి. పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు

అలరించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు





**పెన్ పవర్ ఉంగుటూరు, సెప్టెంబర్ 16:**నారాయణపురం కోట్లమ్మ గుడి సమీపంలో గుణ్ణం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా రెండో రోజు మంగళవారం రాత్రి చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ రీతిలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆద్యంతం అలరించాయి.తొలుత గణపతి మండపం వద్ద తొమ్మిది రకాల ప్రత్యేక పుష్పాలతో వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలతో పాటు చిన్నారుల నృత్య ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు.

## దొంతవరంలో రూ.30 వేలు పలికిన వినాయక లడ్డూ



**పెన్ పవర్ ఉంగుటూరు, సెప్టెంబర్ 16:**దొంతవరం గ్రామంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో వినాయకుడి లడ్డూ రూ.30 వేలు పలికింది. గ్రామానికి చెందిన కంభంపాటి సూరిబాబు––సత్యవతి దంపతులు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు.మండపం వద్ద నిర్వహించిన వేలం పాటకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే లడ్డూ వేలం పాటలో సూరిబాబు––సత్యవతి దంపతులే లడ్డూను దక్కించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే బాబాజీ రావు కి మాజీ ఎంపీ భరత్ పరామర్శ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 17:**అనారోగ్యంతో దివాన్ చెరువు విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావును మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్చార్జి మార్గాని భరత్ రామ్ పరామర్శించారు. వైసిపి పార్లమెంట్ ఇంచార్జ్, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆయనకు వైద్య సేవలు అందిస్తు న్నారు. ఆయన కుమార్తె, మాజీ హోం మంత్రి తానేటి వనితను బాబాజీ రావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాబాజీ రావుకు మంచి వైద్య సేవలు అందుతున్నాయని, త్వరలోనే ఆయన కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలోకి అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు మార్గాని సురేష్, తోట రామకృష్ణ, నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, పీత రామకృష్ణ, కొల్లి నాని తదితరులు ఉన్నారు.

# కూటమిలో ఎవరికి మేయర్ సీటు ఇచ్చినా విజయం కోసం పనిచేస్తా

మీడియా సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**తెలుగుదేశం పార్టీలో తనకు కాకుండా ఎవరికి మేయర్ సీటు ఇచ్చినా చిత్తశుద్ధితో విజయం కోసం పనిచేస్తా నని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు స్పష్టం చేసారు. పార్టీనే అంటిపెట్టుకుని క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నానని తాను కూడా మేయర్ సీటు ఆశిస్తు న్నానని మజ్జి రాంబాబు తెలిపారు. ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ, పార్టీలు మారిన వారికి కాకుండా పార్టీని అంటిపెట్టుకుని కష్టపడి పనిచేసినవారికే సీటు ఇవ్వాలని పార్టీ నిర్ణయమని ఆయన అన్నారు. తనకు అన్ని వర్గాలతో , కూటమి పార్టీలతో సమన్వయం ఉందని, బిసికి రిజర్వ్ అయితే తనకు సీటు ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. తెలుగుదేశానికే మేయర్ ఛాన్స్ వస్తుందని, సమీకరణల్లో కూటమిలో ఏపార్టీ అభ్యర్థికి టికెట్ ఇచ్చినా పార్టీ నిర్ణయాన్ని గౌరవించి విజయం కోసం పనిచేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారన్నారు.

గతంలో బయట అభ్యర్థులను దించిన విధానం ఈసారి ఉండదన్నారు. గత రెండున్నరేళ్లగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. కూటమి పార్టీలను కలుపుకుని నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని రాంబాబు చెప్పారు. లో ఓల్టేజి సమస్య పరిష్కారం కోసం 150 ట్రాన్స్ ఫార్మర్లు వేయించారని, రానున్న పుష్కరాలకు మూడు సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నా రన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం సోషల్ మీడియాలో షోలు చేసారన్నారు. రూ. 350 కోట్ల రూపాయల నిధులతో వివిధ పనులు చేపట్టా రన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో కేంద్రం నిధులు రాబట్టి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభివృద్ధి పనులు చేస్తున్నారని రాంబాబు చెప్పారు. దేవాదాయ శాఖ తొలిదశలో రూ.10కోట్లు, రెండో దశలో రూ.4కోట్లు విడుదల అయ్యాయని ఆయన తెలిపారు. సిఎస్సార్ నిధులు రూ రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నా యని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్ కుమార్, ద్వారా పార్వతి సుందరి, కడలి రామకృష్ణ, ఉప్పులూరి జానకి రామయ్య, కోరుమిల్లి విజయ శేఖర్, బుడ్డిగ రవి, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్‌లో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలి




- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా కార్యక్రమాలు
- ప్రతి ఇంటా ఒక దీపం వెలిగించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలుదొర

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న లి'సేవా సంకల్ప అభియాన్'లిలో పోలవరం జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని బీజేపీ పోలవరం జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలుదొర కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నెల రోజులపాటు జిల్లాలో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛత కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలతో పాటు పలు ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ప్రతి ఇంటా ఆశీర్వాద దీపం**

సెప్టెంబర్ 17న సాయంత్రం 6 గంటలకు పోలవరం జిల్లాలోని 11 ప్రాంతాల్లో 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బుల్లికొండలుదొర తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు కలగాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించాలని ఆకాంక్షిస్తూ ప్రతి కుటుంబం తమ ఇంటి వద్ద ఒక దీపం వెలిగించి ఆశీస్సులు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజాసేవే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ నెల రోజుల కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలుదొర కోరారు."సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా ఒక దీపం వెలిగిద్దాం.. సేవా సంకల్పాన్ని చాటుదాం" అని ఆయన పిలుపునిచ్చారు.



## పటిష్ట ప్రణాళికతో పుష్కర పనులు

**ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా**



**రాజమహేంద్రవరం పెన్ పవర్, సెప్టెంబర్,16:**రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పుష్కరాల ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగర భౌగోళిక స్వరూపం, పుష్కరాలలో భక్తుల రద్దీ, ఘాట్ల వద్ద ఏర్పాట్లు, ట్రాఫిక్ పరిస్థితులు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పుష్కరాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలనిసూచించారు.ఈ సందర్భంగా భరత్ గుప్తా మాట్లాడుతూ, భక్తులకు అసౌకర్యం కలగకుండా గోదావరి నదీ తీరంలో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. , తాగునీరు, తాత్కాలిక వసతులు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తో కలిసి పర్యటించినట్లు తెలిపారు

## పుష్కరాల నాటికి వార్డుల్లో మురుగునీటి సమస్యలన్నీ పరిష్కారం

**✷ 19వ డివిజన్లో పలు సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**పుష్కరాల నాటికి వార్డుల్లో మురుగునీటి సమస్యలన్నీ పరిష్కారిస్తామని, వార్డుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం 19వ డివిజన్ లో పరిశీలించి వార్డులో డ్రైనేజీ సమస్యలను, సచివాలయాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నూతన పింఛన్లు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 18 వరకు గడువు పెంచారని, సచివాలయ సిబ్బంది ఆన్లైన్ చేయాలని సూచనలు చేశారు. రైల్వే గుడ్స్ గేటు వద్ద నుండి ధవలేశ్వరం సాయిబాబా ఆలయం వరకు మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. మెయిన్ డ్రైనేజీ పూర్తి అయిన వెంటనే వార్డుల్లోని డ్రైనేజీలను వాటికి అనుసంధానం చేస్తామన్నారు. వర్షపునీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించామని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి.ఈ కే.సత్యనారాయణ, కక్కల రమేష్, ఆర్జీల లక్ష్మణరావు, గొందేసి హరినాథ్ రెడ్డి, శీలం గోవిందు, రొంపిచర్ల ఆంటోనీ, చిట్టి బోయిన శ్రీనివాస్, పిలక వెంకటరమణారెడ్డి, బొంతు ప్రసాదు, పాలిక వెంకటరమణ, కేత అప్పారావు, రీసు దుర్గారావు, కేతా విజయకుమార్, నాగళ్ళ కృష్ణ, మోహన్ రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## విఎస్ఎస్ లకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, సెప్టెంబర్ 16;** అటవీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు అడవుల సంరక్షణలో వన సంరక్షణ సమితులు కీలక పాత్ర పోషిస్తున్నాయని పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు అన్నారు. బుధవారం ములగలంపల్లి పంచాయతీ పరిధిలో కనకాపురం గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వి ఎస్ ఎస్ సభ్యులకు షేరింగ్ అమౌంటు లో భాగంగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని అటవీ సంరక్షణకు మరింత కృషి చేయాలని సూచించారు. కనకాపురం, జిల్లెల్ల గూడెం, బుట్టాయిగూడెం మండలం వెలుతురు వారి గూడెం గ్రామాలకు చెందిన మూడు చెక్కులకు గాను కోటి 18 లక్షల రూపాయలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అటవీ శాఖ అధికారి పి సందీప్ రెడ్డి, సబ్ డి ఎఫ్ ఓ వెంకటసుబ్బయ్య, జంగారెడ్డిగూడెం రేంజ్ ఆఫీసర్ దుర్గాకుమార్, తహసిల్దారు జి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పొట్ట రామారావు, ఇన్చార్జి ఎఫ్ఎస్ఓ కె రాంబాబు ,కూటమి నాయకులు ఉండవల్లి సోమ సుందరం, టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, బండారు అనిల్ కుమార్, పద్దం వెంకటకృష్ణ, కుంజా రమేష్, శ్రీకాంత్ ,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల నాటికి వార్డుల్లో మురుగునీటి సమస్యలన్నీ పరిష్కారం

**19వ డివిజన్లో పలు సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**పుష్కరాల నాటికి వార్డుల్లో మురుగునీటి సమస్యలన్నీ పరిష్కారిస్తామని, వార్డుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం 19వ డివిజన్ లో పరిశీలించి వార్డులో డ్రైనేజీ సమస్యలను, సచివాలయాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నూతన పింఛన్లు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 18 వరకు గడువు పెంచారని, సచివాలయ సిబ్బంది ఆన్లైన్ చేయాలని సూచనలు చేశారు. రైల్వే గుడ్స్ గేటు వద్ద నుండి ధవలేశ్వరం సాయిబాబా ఆలయం వరకు మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. మెయిన్ డ్రైనేజీ పూర్తి అయిన వెంటనే వార్డుల్లోని డ్రైనేజీలను వాటికి అనుసంధానం చేస్తామన్నారు. వర్షపునీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించామని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి.ఈ కే.సత్యనారాయణ, కక్కల రమేష్, ఆర్జీల లక్ష్మణరావు, గొందేసి హరినాథ్ రెడ్డి, శీలం గోవిందు, రొంపిచర్ల ఆంటోనీ, చిట్టి బోయిన శ్రీనివాస్, పిలక వెంకటరమణారెడ్డి, బొంతు ప్రసాదు, పాలిక వెంకటరమణ, కేత అప్పారావు, రీసు దుర్గారావు, కేతా విజయకుమార్, నాగళ్ళ కృష్ణ, మోహన్ రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** ఆపదలో ఉన్న పేద మధ్య తరగతి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి పేర్కొన్నారు. మండలంలోని బుధవారం నాడు పలు గ్రామాలకు చెందిన 20మంది లబ్ధిదారులకు8,22,711లక్షల విలువైన సీఎం సహాయనిధ చెక్కులను బుధవారం అందజేశారు. అనారోగ్య వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా ఆదుకునేందుకు ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల పై వంగలపూడి గ్రామంలో పార్టీ నాయకులతో కలిసిచర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు, టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి, గద్దె శ్రీను, గద్దె నాని, సొసైటి చైర్మన్ కాండ్రు శేఖర్, నీరుకోండ శివ, ఓబులనేని కృష్ణ చైతన్య, సంగన చిన పోశయ్య, వలవల రాజా, గుర్రం ఉదయ్, సోషల్ మీడియా కన్వీనర్ పుక్కాల శ్రీనివాస్, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఓజోన్ దినోత్సవం







**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎన్. మణిమాల ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఓజోన్ పొర జీవరాశికి రక్షణ కవచంగా పనిచేస్తుందని, ఓజోన్ పొర క్షీణించడం వల్ల పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాలు పడే అవకాశం ఉందని ఆమె వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణహిత జీవన విధానాలను పాటించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు డా. శివకృష్ణ మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణించడం వల్ల గ్లోబల్ వార్మింగ్‌తో పాటు చర్మవ్యాధులు, కంటి సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి అనేక దుష్పరిణామాలు సంభవించే అవకాశం ఉందని వివరించారు. జువాలజీ విభాగానికి చెందిన జి. సాయికుమార్ మాట్లాడుతూ స్ట్రాటోస్ఫియర్‌లో ఉండే ఓజోన్ పొర సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాలను అడ్డుకుని భూమిపై జీవరాశిని రక్షిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వై. పద్మ, ఎం.రాకేష్ రాజ్, డా. ఝాన్సీ, బి. శ్రీనివాసరావు, ఆనంద్, కోట్ల లక్ష్మీ ప్రసన్న, కే. కీర్తి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన మత్స్యరైతులకు ఉచితంగా రోహు చేప పిల్లలు



**25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 16:**గిరిజన మత్స్యరైతులను ప్రోత్సహించి వారి జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో నాణ్యమైన రోహు చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు మత్స్యశాఖ అధికారి కదిరి సతీష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రంపచోడవరం పరిధిలోని పందిరిమామిడి ప్రభుత్వ చేపల విత్తన క్షేత్రంలో శాస్త్రీయ పద్ధతుల్లో పెంచుతున్న నాణ్యమైన రోహు చేప పిల్లలను ఐటీడీఏ రంపచోడవరం, చింతూరు పరిధిలోని గిరిజన మత్స్యరైతులకు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు.గిరిజన మత్స్యరైతులు తమ చెరువులు, కుంటలు, ఇతర అనుకూలమైన జలవనరుల్లో చేప పిల్లలను పెంచుకోవడం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని సతీష్ తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తిగల మత్స్యరైతులు రంపచోడవరం మత్స్యశాఖ కార్యాలయంలో లేదా సంబంధిత గ్రామ సచివాలయాల్లోని మత్స్య సహాయకుల వద్ద దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.దరఖాస్తుల సమర్పణకు ఈనెల 25వ తేదీ చివరి గడువు అని మత్స్యశాఖ అధికారి కదిరి సతీష్ స్పష్టం చేశారు. అర్హులైన గిరిజన మత్స్యరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవ వేడుకలు**




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 16:**ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.టి. మహాలక్ష్మి మాట్లాడుతూ భూమిపై జీవరాశులను సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షించడంలో ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ బి. అన్నమణి మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్ర, భవిష్యత్ తరాల కోసం ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఐకార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# నిరుద్యోగ యువతకు డ్రోన్ పైలట్ శిక్షణ

**18న ఇంటర్వ్యూలు.. రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనం పొందే అవకాశం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 16:**పోలవరం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు డ్రోన్ పైలట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. పెరుమాళ్లరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ శిక్షణను విజయవాడకు చెందిన డ్రోన్ సంస్థ ద్వారా అందించనున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో డ్రోన్ నిర్వహణ, వైమానిక సర్వేలు, వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, భూమి కొలతలు, పటాల తయారీ, భద్రతా విధానాలు, డీజీసీఏ మార్గదర్శకాలపై ప్రాయోగిక శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలకు సహకారం అందిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ఉద్యోగంలో చేరేందుకు అంగీకరించిన వారికి నెలకు సుమారు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనం పొందే అవకాశం ఉందన్నారు.డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం, భూ సర్వేలు, పటాల తయారీ, నిర్మాణ రంగం, విపత్తు నిర్వహణ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని పెరుమాళ్లరావు తెలిపారు. భవిష్యత్తులో డ్రోన్ ఆధారిత సేవల ద్వారా స్వయం ఉపాధి పొందే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.అర్హతలు: ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ లేదా ఐటీఐ ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ నిర్వహణపై ఆసక్తి ఉన్న యువతకు ప్రాధాన్యం ఉంటుంది.డ్రోన్ పైలట్ శిక్షణకు సంబంధించిన ఇంటర్వ్యూలు ఈనెల 18న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రంపచోడవరం పీఎంఆర్‌సీ ప్రాంగణంలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువని పేర్కొన్నారు. పోలవరం జిల్లాకు చెందిన అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆనంద్ బాబు -- 6304634447, 6281618037. ఫోన్ నెంబర్లు సంప్రదించాలని ఆయన కోరారు



## ఆదివాసీలకు పూర్తి పునరావాసం కల్పించిన తర్వాతే పోలవరం ప్రాజెక్టు ప్రారంభించాలి

**అమరావతి రైతుల తరహాలో పోలవరం నిర్వాసిత ఆదివాసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి**



**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న ఆదివాసీలకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం అందించిన తర్వాతే ప్రాజెక్టును ప్రారంభించాలని జాతీయ ఆదివాసీ సమన్వయ కమిటీ (అఖిలభారత ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ చందా లింగయ్య దొర పోలవరం పునరావాస కమిషనర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ప్రారంభించే నాటికి నిర్వాసితుల పునరావాస ప్రక్రియ పూర్తయ్యేలా తగినంత సిబ్బందిని నియమించాలని కోరారు. రెండో దశలో 45.75 మీటర్ల కాంటూరు వద్ద ముంపునకు గురయ్యే గ్రామాలు, భూములు, కుటుంబాలను గుర్తించేందుకు మరోసారి సమగ్ర రీసర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల్లో పునరావాసానికి సంబంధించిన ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి, ఆదివాసీల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా సర్వే చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సాగుభూములకు నష్టపరిహారం. భూమికి బదులు భూమి అడవి హక్కుల చట్టం 2006 పరిధిలో ఆదివాసీలు సాగు చేస్తున్న భూములు, జీడిమామిడి తోటలు, పోడు వ్యవసాయ భూములకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు భూమికి బదులు భూమి కేటాయించాలని కమిటీ ప్రతినిధులు కోరారు. పునరావాసానికి అర్హులైన భూమిలేని ఆదివాసీలతో పాటు 18 సంవత్సరాలు నిండిన వారికి పునరావాస ప్యాకేజీలో భాగంగా ఇళ్లు నిర్మించి, సాగు చేసుకునేందుకు భూములు కొనుగోలు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీల జీవన విధానానికి అనుగుణంగా పశువులు, చెట్లు పెంచుకునేందుకు ఇంటి స్థలాన్ని 10 సెంట్లుగా కేటాయించి ఇళ్లు నిర్మించాలని కోరారు. మైదాన ప్రాంతాల్లో ప్రధాన కాలువల నిర్మాణానికి ఎకరాకు రూ.కోటి వరకు చెల్లించిన నష్టపరిహారాన్ని పరిగణనలోకి తీసుకుని, పోలవరం ప్రాజెక్టు పరిధిలోని ఆదివాసీ భూములకు కూడా తగిన నష్టపరిహారం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి ప్రాజెక్టు ప్రాంతంలో సాగుభూములను కొనుగోలు చేసి నిర్వాసిత ఆదివాసీలకు అందించాలని, ఫిషింగ్, టూరిజం తదితర రంగాల్లో అర్హులైన నిర్వాసితులకు శిక్షణ ఇచ్చి పోలవరం ప్రాజెక్టులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే 13 ఏళ్ల క్రితం నిర్ణయించిన పునరావాస ప్యాకేజీని ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి రైతులకు ప్రాధాన్యత ఇచ్చిన విధంగానే పోలవరం నిర్వాసిత ఆదివాసీల పునరావాసం, నష్టపరిహారం అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కురసం సుబ్బారావు, మండల సీపీఐ కార్యదర్శి తుర్రం మురళి, కురసం రామకృష్ణ, ప్రసాద్, సాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై పార్టీల ప్రతినిధుల సమావేశం






**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** చింతూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న ప్రచురించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై సూచనలు స్వీకరించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ముసాయిదా జాబితాను పరిశీలించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తుత పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి మార్పులు, చేర్పులు అవసరం లేదని తెలిపారు. సమావేశానికి టీడీపీ, జనసేన, బీజేపీ, వైఎస్సార్‌సీపీ, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ప్రతినిధులతో పాటు మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగానే పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు సమావేశం నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుందం శ్రీనివాసు దొర తెలిపారు.

# కార్మికుల హక్కుల కోసం విస్తృత పోరాటాలు

**సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ నర్సింగరావు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** ఏజెన్సీ ప్రాంతంలోని యావత్ కార్మికవర్గం హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో సీఐటీయూ ఆధ్వర్యంలో విస్తృత పోరాటాలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ నర్సింగరావు తెలిపారు. బుధవారం రంపచోడవరం ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎం.వాణిశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.అభివృద్ధి పేరుతో పెట్టుబడిదారులకు ప్రయోజనాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ఉత్సాహాన్ని ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణలో చూపడం లేదని నర్సింగరావు విమర్శించారు. కార్మికుల పనిగంటలు, పని విస్తృతిని పెంచడం, మహిళలతో రాత్రి వేళల్లో పని చేయించడం వంటి మార్పులను కార్మిక చట్టాల్లో తీసుకురావడాన్ని ఆయన తప్పుబట్టారు.మూడు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస కాలిక వేతన విధానం అమలు చేయడంలో ప్రభుత్వం అదే వేగాన్ని చూపడం లేదని, ప్రైవేటు షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 50 లక్షల మంది కార్మికుల కనీస వేతనాల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు తదితర పథకాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల పెంపును కూడా తాత్సారం చేస్తోందని విమర్శించారు.కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో గతంలో న్యాయ సలహాతో జారీ చేసిన జీవో 114ను అమలు చేయడం లేదని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడంలోనూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.



పెరిగిన నిత్యావసర ధరలు, జీవన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వేతనాలు నిర్ణయించడం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించేలా శాస్త్రీయ ప్రమాణాలతో కనీస వేతనాలను పునర్నిర్ణయించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్మికుల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని, కొనుగోలు శక్తి తగ్గిన నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు పని దినాలు పెంచడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగితే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నర్సింగరావు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏజెన్సీలో సీఐటీయూను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం భవిష్యత్ పోరాటాలకు సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీఐటీయూ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్, జిల్లా నాయకులు బి.నిర్మల, కె.శాంతిరాజు, పి.రామరాజు, రాజేశ్వరి రాణి, జి.సురేష్, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పరిశోధనకు పట్టం.. ప్రతిభకు పురస్కారం

- ఏపీ నిట్ ఆచార్యులు డాక్టర్ రఫీ మహమ్మద్‌కు ప్రతిష్ఠాత్మక విశిష్ట ఇంజనీర్ అవార్డు
- రఫీ మహమ్మద్ ను అభినందించిన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. సెప్టెంబర్ 16:**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) లోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సేవలందిస్తున్న డాక్టర్ రఫీ మహమ్మద్ ప్రతిష్ఠాత్మక విశిష్ట ఇంజనీర్ (అకడమిక్స్) అవార్డు--2026 అందుకున్నారు. ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెంటర్ (ఐఈఐ-ఏపిఎస్సి) ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో 59వ ఇంజినీర్స్ డే అవార్డ్స్--2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఏపీ స్టేట్ సెంటర్ చైర్మన్ ప్రొఫెసర్ , డాక్టర్ ఎం.ఎల్.ఎస్. దేవ కుమార్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. సుదర్శన రావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పీఆర్ అండ్ ఆర్డీ విభాగం అదనపు కమిషనర్ (రిటైర్డ్) మల్లెల శివ ప్రసాద్ ఇమ్మీడియట్ పాస్ట్ చైర్మన్ డాక్టర్. సి.వి. శ్రీరామ్, గౌరవ కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ ఏ.వి. నరేష్ బాబు చేతులమీదుగా డాక్టర్ రఫీ మహహ్మద్ పురస్కారాన్ని అందుకున్నారు.ఇంజినీరింగ్ విద్య, బోధన, పరిశోధన, విద్యార్థులకు మార్గదర్శకత్వం, ఇంజినీరింగ్ రంగానికి అందిస్తున్న విశిష్ట సేవలను నిర్వాహకులు గుర్తించి ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ఈ పురస్కారం ఆయన అకడమిక్ ప్రస్థానంలో మరో ప్రతిష్ఠాత్మక మైలురాయిగా నిలవనుంది. డాక్టర్ రఫీ మహమ్మద్ వెల్డింగ్ మెటలర్జీ, కారోషన్ సైన్స్, అధునాతన ఇంజినీరింగ్ మెటీరియల్స్ తదితర రంగాల్లో పరిశోధనలు చేస్తున్నారు. ముఖ్యంగా తుప్పును నిరోధించే పదార్థాలు, ఆధునిక వెల్డింగ్ సాంకేతికతలు, దేశ రక్షణ రంగానికి సంబంధించిన వ్యూహాత్మక అవసరాలకు ఉపయోగపడే అధునాతన పదార్థాల అభివృద్ధిపై ఆయన పరిశోధనలు చేస్తున్నారు. ఏపీ నిట్ లో దశాబ్దానికి పైగా విద్యా సేవలు అందిస్తున్న ఆయన బోధనతో పాటు పరిశోధన, విద్యార్థుల ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం వంటి అంశాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తూ, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అవార్డుగ్రహీత డాక్టర్ రఫీ మహమ్మద్ ను ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, డాక్టర్ హిమబిందు ప్రత్యేకంగా అభినందించారు. ఇంజినీరింగ్ విద్యా రంగంలో నాణ్యమైన బోధన, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి, సమాజం, దేశ అవసరాలకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలపై ఆయనచూపుతున్న నిరంతర నిబద్ధతకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచిందని కొనియాడారు.

**డాక్టర్ రఫీ మహమ్మద్ విద్యాభ్యాసం, అవార్డులిలా...**

ఈయన స్వస్థలం విశాఖపట్నం. బీటెక్, ఎంటెక్, పీహెచ్ డి కోర్సులను ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పూర్తి చేశారు. 2016లో ఏపీ నిట్ లో అధ్యాపక వృత్తిని చేపట్టారు. మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా రెండు పర్యాయాలు సేవలందించారు. ప్రస్తుతం ఐఐఎం విశాఖపట్నం చాప్టర్ వైస్ ఛైర్మన్ గా సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్నారు. 2018లో ఇండియన్ ఇన్స్టిట్యూట్ వెల్డింగ్ నుంచి ఐ.టి మిర్చందాని మెమోరియల్ రీసెర్చ్ అవార్డును, అదే సంస్థ నుంచి వీనస్ వైర్స్ అవార్డులను అందుకున్నారు. 2023లో అసోసియేషన్ ఫర్ మెటీరియల్స్ ప్రొటెక్షన్ అండ్ పెర్ఫార్మన్స్ ఇండియా నుంచి కొరోషన్ అవేర్నెస్ అవార్డును, 2025 లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ మెటల్స్ (ఐఐఎం) నిర్వాహకుల నుంచి బెస్ట్ స్టూడెంట్స్ ఆఫిలియేట్ చాప్టర్ అవార్డును అందుకున్నారు, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ 2026 సంవత్సరానికి సీనియర్ ఇండివిద్యువల్ మెంబర్‌గా ఎంపిక అయ్యారు.

## అద్దేపల్లి కాలనీ యు. పి. హెచ్ సి ఆకస్మిక తనిఖీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** పట్టణ పరిధిలో యు. పి. హెచ్ సి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అద్దేపల్లి కాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.పి. కోమల బుధవారం ఆకస్మికంగా సందర్శించి ఏ ఎన్ ఎమ్, ఆశాలకు వైద్యాధికారిలతో సమావేశం ఏర్పాటు చేసారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. అన్ని యాప్ లలో వివరాలు నమోదు ను పరిశీలించి నూటికి నూరు శాతం అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. గర్భిణి స్త్రీ రిజిస్టర్, చైల్డ్ బర్త్ వ్యాధి నిరోధక టికాల రిజిస్టర్, ఎన్ సిడి ఆర్ బిఎస్ కె రికార్డులను తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో డా. హరి చంద్ర ప్రసాద్ ఎన్ సిడి , ఆర్ బిఎస్ కె, యు. పి. హెచ్ సి వైద్యాధికారి ఐ. శిరీష పాల్గొన్నవారు.

## శ్రీరామగిరి,గ్రామప్రజలకు దోమతెరలు పంపిణీ



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్. 16:**పోలవరం జిల్లాకలెక్టర్, చింతూరుప్రాజెక్టుఅధి కారి వారిఆదేశాలమేరకు జిల్లామలేరియా అధికారిమరి యు,డిప్యూటీడి. ఎం. హెచ్.ఓ,జీడిగుప్పప్రభుత్వవైద్య శాలడాక్టర్ నిరంజన్ కుమార్,మ ండలకమిటీసభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామగిరి,గ్రామప్రజలకుదోమతెరలుపం పిణీ చేశారు. ఈసందర్భంగా జీడిగుప్పప్రభుత్వవైద్య శాలడాక్టర్,నిరంజన్ కుమార్, మాట్లాడుతూగృహాల్లో ప్రతిఒక్కరూదోమతెరలువాడాలని,కాచినమంచినీరు త్రాగాలని,గృహాలుప్రక్కన మురికిగుంటలుఉన్నట్లయి తే,వెంటనేపూడ్చివేయాలని, ఈసంవత్సరం ఏప్రిల్,నెల లోమలేరియా ప్రభావితప్రాంతాల్లో మొదటివిడత దో మతెరలుపంపిణీ కార్యక్రమం పూర్తిఅయిందని,రెండో విడతలో శ్రీరామగిరి,గ్రామంలో దోమతెరలుపంపిణీ చేశామని,అన్నారు. ఈకార్యక్రమంలో వి.ఓ.డి.దుర్గ వి.ఓ.ఏ.ఎన్.రాజేశ్వరి,సెక్రటరీరవిరాజు,వైద్యసిబ్బంది. హెల్త్ అసిస్టంట్,పి.రామారావు ఎ.ఎన్.ఎం.అనిత,ఆశ వర్కర్,ఎస్.రావణమ్మ,అంగన్వాడీవారుగ్రామప్రజలు తదితరులుపాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## చదివించు కుందామంటే టి. సి.ఇచ్చేశారు

విద్యార్థిని తల్లి ఆవేదన



**వై రామవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 16:** తన కుమార్తెను యార్లగడ్డ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో ఐదవ తరగతిలో జాయిన్ చేయగా ఆగస్టు 27వ తేదీన టిసి ఇచ్చేసారని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోనికి వెళితే తన కుమార్తె కంగల హర్షిని ని ఐదవ తరగతిలో జాయిన్ చేయడం జరిగిందని తల్లి దుర్గ తెలిపారు. తన కుమార్తెకు ఆస్మా ఉందని, గత నెలలో ఒకసారి ఇంటికి తీసుకుని వెళ్లి వెంటనే పంపించేయడం జరిగిందని తెలిపారు. ఆగస్టు నెల 27వ తేదీన ప్రధానోపాధ్యాయురాలు టి సి ఇచ్చి పంపించి వేశారని తెలిపారు. అప్పటినుండి ప్రతి పాఠశాలకు వెళ్లి కుమార్తెను జాయిన్ చేయడం కోసం తిరిగిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి తన కుమార్తెను తిరిగి పాఠశాలలో జాయిన్ చేయించగలరని ఆమె కోరుకుంటున్నట్లు తెలిపారు.

## వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మదీనా బాషా

పార్టీ బలోపేతానికి ముస్లింలకు మాజీ ఎంపీ భరత్ పిలుపు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నగరానికి చెందిన సయ్యద్ మదీనా భాషానుతూర్పుగోదావరి జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించా రు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితు లైన సయ్యద్ మదీనా భాషా తన మిత్రమండలితో కలిసి స్థానిక వి ఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ వైసీపీ సిటీ కార్యాలయంలో మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్చార్జి మార్గాని భరత్ రామ్ ను కలిశారు. జిల్లా మైనారిటీ విభాగానికి అధ్యక్షుడిగా తనను నియమించడం పట్ల భరత్ కు కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తి వంచన లేకుండా పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తానని, ముస్లిం మైనార్టీ లకు వైసీపీ తరపున అండగా నిలబడతానని తెలిపారు. భరత్ రామ్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, వారికి 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన బాటలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారి సంక్షేమానికి అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనారిటీ విభాగం బలోపేతానికి చేయాలని సూచించారు. పలువురు వైసిపి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల నాయకులు మదీనా భాషాను పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.ఐ

## పోలింగ్ స్టేషన్ ఏర్పాటుపై రాజకీయ పార్టీలతో సమావేశం...



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్16;**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వారి సర్క్యులర్ ను అనుసరించి అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు 2వ ఆర్డినరీ మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు మరియు జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు ఎన్నికల కొరకు ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల పై అన్ని రాజకీయ పార్టీ నాయకులతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం అడ్డతీగల లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండల స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీ నుండి ఈరోజు.స్వప్న కుమారి, రాష్ట్ర కార్యదర్శి,వైసిపి పార్టీ నుండి ఎన్. వీర్రాజు జెనరల్ సెక్రటరీ, తెలుగు దేశం పార్టీ, జె.రమణారెడ్డి , మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, వైసిపి పార్టీ నుండి ఎం. శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ ,తెలుగు దేశం పార్టీ నుండి వంకా. సతీష్, మాజీ మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రెండవ ఆర్డినరీ మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యుల ఎన్నికలకు గాను 42 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. గ్రామముల వారిగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల వివరాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి తెలియజేశారు. ఈ సమావేశంలో పాల్గొనిన రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎవ్వరూ కూడా పోలింగ్ స్టేషన్ల పై అభ్యంతరములు తెలియజేయలేదని, అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు.

# మండల అభివృద్ధికి కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు




**ఐదేళ్ల పదవీకాలంలో చివరి సర్వసభ్య సమావేశం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**ఐదేళ్ల పదవీకాలంలో రంపచోడవరం మండల అభివృద్ధికి సహకరించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మండలం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు బంధం శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బంధం శ్రీదేవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పాలకవర్గానికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడంతో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ఐదేళ్లలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర శాఖల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయడం జరిగిందన్నారు. గిరిజన రైతులకు అవసరమైన ఎరువులు, అపరాలు సకాలంలో అందించాలని అధికారులను కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని సూచించారు.నిరుపేద గిరిజన కుటుంబాలకు గృహాలు మంజూరు చేయడంతో పాటు వి.బి.జి. రామ్ జీ పథకం కింద జాబ్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.సమావేశంలో వైస్ ఎంపీపీలు కె. బాలకృష్ణ, పండా కుమారి, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, ఎస్సై నాగభూషణం, ఎంపీటీసీ సభ్యులు కుంజం వంశీ, తుర్రం వెంకటేశ్వర్లు, ఉలవల లక్ష్మి, నర్రి పాపారావు, కె. రమణమ్మ, బి. మంగ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజావలి, సహాయ గిరిజన సంక్షేమ అధికారి జె. శంబుడు, డీవైఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, డాక్టర్ కెవిన్, మండల వ్యవసాయ అధికారి కె. లక్ష్మణ్, ఎంపీడీవో కార్యాలయ ఏవో పి. జయంతి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.అనంతరం ఐదేళ్లపాటు మండల అభివృద్ధికి కృషి చేసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులను ఎంపీడీవో ప్రసాద్, ఏవో పి. జయంతి, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

# పదవి ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం





ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తామని గంగవరం మండల పరిషత్ అధ్యక్షుడు పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం అన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసినట్లు వారు తెలిపారు.బుధవారం గంగవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వై.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పాలకవర్గానికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మండలంలోని ప్రజా సమస్యలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం మాట్లాడుతూ ఐదేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశామన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గంగవరం మండలాన్ని అన్ని మండలాల్లో ప్రత్యేకంగా నిలిచేలా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.సమావేశంలో వైస్ ఎంపీపీ గంగాదేవి, కోఆప్షన్ సభ్యుడు కల్లం సూర్యప్రభాకర్, పలువురు ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. గ్రామాల్లో నెలకొన్న ఇతర సమస్యలపై కూడా సభ్యులు చర్చించారు.

**పోషకాహార స్టాల్ ప్రారంభం**

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పోషణ మాసోత్సవ ప్రదర్శనను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం ప్రారంభించారు. స్టాల్లో ప్రదర్శించిన వివిధ రకాల పోషకాహార పదార్థాలను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ వి.సుచరిత ఆదిలక్ష్మి, ఏజెన్సీ విద్యాశాఖ అధికారి వై.మల్లేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ ప్రకాశ్‌రావు, పశువైద్యశాల వైద్యుడు అప్పన్నబాబు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్

**రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు**

**గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 16:** వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమన్వయంతో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు అన్ని జిల్లాల్లో వివిధ ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ కార్యక్రమాల్లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యా సంస్థలు, ప్రజలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం సూచించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడంతో పాటు కార్యక్రమాలకు సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను సేకరించి అధికారిక సమాచార మార్గాలు, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించనున్నారు.

**ప్రధాన కార్యక్రమాలు**

ఆశీర్వాద్ కా దియా: సెప్టెంబర్ 17న సాయంత్రం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల కుటుంబాలతో వారి ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 'డ్రీమ్స్ ఆఫ్ ఇండియా' -- విద్యార్థుల ప్రతిభకు వేదిక: పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థులకు చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహించనున్నారు. ప్రధాని సేవా రికార్డు, అభివృద్ధి చెందిన భారత్ అంశాలపై ఈ పోటీలు జరగనున్నాయి. విజేతలకు ముఖ్యమంత్రి సంతకం చేసిన ధ్రువపత్రాలను అందజేయనున్నారు.

నమో సేవా గాథ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ 25 నుంచి 30 నిమిషాల నిడివి గల సంగీత, వీధి నాటకాలను పాఠశాలలు, కళాశాలలు, ప్రజా ప్రదేశాల్లో ప్రదర్శించనున్నారు.

ఆంగన్ కా ఉత్సవ్: సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సన్మానించడంతో పాటు పోషకాహారం, సంక్షేమ పథకాలపై తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించనున్నారు.

సేవా మేరా యోగదాన్: సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు పౌరులు తమకు నచ్చిన సేవా కార్యక్రమాన్ని ఎంచుకుని కనీసం 25 నిమిషాల పాటు సేవ చేయవచ్చు. కార్యక్రమానికి సంబంధించిన ఆధారాలను 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకుని డిజిటల్ ధ్రువపత్రం పొందే అవకాశం కల్పించనున్నారు. అక్టోబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

సేవా సేతు అభియాన్:ప్రతి శాసనసభ నియోజకవర్గంలోని మండల స్థాయిలో 'సేవా సేతు' శిబిరాలను నిర్వహించి, అర్హులైన ప్రజలకు వివిధ ప్రభుత్వ పథకాలను ఒకే వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు.

కహానీ బదలావ్ కీ:ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను సేకరించి, ఎంపిక చేసిన కథనాలను దృశ్య రూపంలో రూపొందించి ప్రజలకు చేరువ చేయనున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర:దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన అభివృద్ధి ప్రదేశాలను డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలు, ప్రభావశీలుల ద్వారా సందర్శింపజేసి అక్కడి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు పరిచయం చేయనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నూతన ఆవిష్కరణల సవాల్:

యువత, నూతన సంస్థలు, నూతన ఆలోచనలతో ముందుకు వచ్చే వారిని భాగస్వామ్యం చేస్తూ వినూత్న ఆలోచనలను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల అమలులో సంబంధిత శాఖల అధికారులు సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు. కార్యక్రమాల ప్రణాళిక, సమన్వయం, అమలు, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

## జాతీయ పోషకాహార మాసోత్సవముల భాగం తల్లులకు పౌష్టికాహారం అందజేత





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 16:**సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేది వరకు జరిగే జాతీయ పోషకాహర మాసోత్సవముల లో భాగం గా బుధవారం రెండవ వార్డ్ లో ఈ కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమంలో తల్లులకు నువ్వు తీసుకునే భోజనం ప్లేట్ గురించి తెలుసుకో అనే విషయం గురించి తరలియజేయడమైనది అనగా మనం ప్రతి రోజు తీసుకునే ఆహారం లో పిండిపదార్ధాలు , క్రొవ్వుపదార్ధాలు, మాంసపుకృత్తులు, విటమిన్ లు, మినరల్స్ తప్పనిసరిగా ఉండవలెనని దానినే సమతులాహారం అంటారని తెలియజేయడమైనది వాటిని వారు ఎలా ఎంత మొత్తం లో తీసుకోవాలి అనేవిషయాలను కూడా చేసి చూపించడమైనది అన్నారు. వాటిని వారియొక్క రోజువారీ ఆహారం లో తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేసారు.. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిహెచ్ దుర్గ భవాని, అంగన్వాడీ వర్కర్స్ మరియు తల్లులు హాజరైనారు.

# జాతీయ గర్వం అహంకారంగా మారితే..
# గెలుపుకు ప్రాధాన్యత ఉండదు:

## భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

**ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు**

**నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించేందుకు నిరాకరించిన టీమ్**

**వినయం లేని దేశం గెలిచినా ఓడిపోయినట్టే అన్న యూసఫ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నఖ్వీకి షాక్ ఇచ్చింది.దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.

ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. "జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే" అని ట్వీట్ చేశాడు.మోహ్సిన్ నఖ్వీని ప్రశంసిస్తూ యూసఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ట్రోఫీ తీసుకోకపోవడంపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ ఇది బోర్డు తీసుకున్న సంస్థాగత నిర్ణయమని స్పష్టం చేశారు. వేడుకల్లో పాల్గొనకూడదనే విషయాన్ని ఏసీసీకి ముందే అధికారికంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతల దృష్ట్యా దేశప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఆటగాళ్లకు లేదా క్రీడకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోని వ్యూహాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి.. ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం

**స్వదేశానికి తిరిగి రానున్న ఐపీఎల్ మినీ వేలం**

**ఫ్రాంచైజీల విజ్ఞప్తితో పాలకమండలి నిర్ణయం**

**2024 నుంచి దుబాయ్, జెడ్డా వంటి నగరాల్లో వేలం**

**వేదికపై ఇంకా రాని స్పష్టత**

**ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న చర్చ**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.

# 2027 ప్రపంచకప్ గెలవాలంటే ఆ తప్పులు చేయొద్దు.. టీమిండియాకు యువరాజ్ కీలక సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు.క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు.ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు.గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం





సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.

అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్దయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం.మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965